ప్రజాశక్తి

ఆదివారం 11 ఫిబ్రవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లకు

సాంకేతిక అడ్డంకులు

యలమంచిలి మున్సిపాలిటీ పరిధి 20వ వార్డులో సాగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

- సర్వర్ మొరాయింపు
- సచివాలయాల వద్ద లబ్ధిదారులు నిరీక్షణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వర్లపై ఒత్తిడి పెరగడంతో ఎక్కువ సమయం లబ్ధిదారులు సచివాలయాల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో జిల్లాలో 54 వేల మందికి ప్రభుత్వం పట్టాలు జారీచేసింది. వీటన్నింటినీ లబ్ధిదారుల పేర రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ సచివాలయాల్లో ఇంటర్నెట్ సరిగా లేకపోవడం, సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో పట్టాల రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగుతున్నాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించినా ఇంతవరకు 20 శాతం కూడా పూర్తికాలేదు. ఇళ్ల పట్టాల మంజూరులో లబ్ధిదారునిపేరు, హద్దులు సరిగా నమోదు చేయకపోవడంతో రిజిస్ట్రేషన్ వేగవంతంగా చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ ఒక మిగతా 2లో..

చింతపల్లి సభలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షురాలు షర్మిల

హామీలు గాలికి..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వైఎస్.షర్మిల విమర్శలు
- చింతపల్లి, నాతవరంల్లో కాంగ్రెస్ సభలు
- పలువురు పార్టీలో చేరిక

ప్రజాశక్తి - చింతపల్లి, నర్సీపట్నం టౌన్ విలేకరులు

'మాట తప్పను.. మడమ తిప్పను' అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని, మరోవైపు కేంద్ర బిజెపి ఎపి ప్రజలకు అన్నింటా మోసం చేసిందని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల విమర్శించారు. అల్లూరి జిల్లా చింతపల్లిలోనూ, అనకాపల్లి జిల్లా నాతవరం మండలం ములగపూడి గ్రామంలోనూ శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల జరిగిన సభల్లో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శల వర్షం కురిపించారు. జగన్ జాబ్ క్యాలెండర్ పేరిట నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఎపికి ప్రత్యేక హోదా తీసుకురాకుండా ఈ ఐదేళ్లు ఎంపీలు గాడిదలు కాసారా ? అని ఆంధ్ర పార్లమెంట్ సభ్యులను ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం ఎంపీలు ఎందుకు రాజీనామాలు చేయలేదన్నారు. మద్యం లేకుండా చేసి ఓట్లు అడుగుతామన్న జగన్ మోహన్ రెడ్డి సర్కారే నేడు మద్యం అమ్ముతోందన్నారు. రాష్ట్రంలో అమ్ముతున్న బ్రాండ్లు తాగి 25 శాతం మంది లివర్ చెడిపోయి చనిపోతున్నారని ఆరోపించారు. తన పుట్టింటికి అన్యాయం జరుగుతోందని భావించి ఎపిలో అడుగు పెట్టానన్నారు. రాష్ట్రంలో భూ కబ్జాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు బిజెపికి లొంగిపోయాయని అన్నారు. ఒక ఎంపీ, ఎమ్మెల్యే లేకపోయినా ఎపిలో బిజెపి రాజ్యమేలుతోందని మిగతా 2లో..

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా రాష్ట్రంలోని కలెక్టర్లను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, సూచనలు పాటించాలన్నారు. ఎటువంటి పొరపాట్లూ లేకుండా వాటిని అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న వారికి, మార్పులు, చేర్పులకు సంబంధించి ఎపిక్ కార్డులు జిల్లాకు రావాల్సి ఉందన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు.

ఎఐ క్లౌడ్ సమ్మిట్‌కు స్పందన

వార్త 2లో..

ఆడుదాం - ఆంధ్ర ముగింపు వేడుకకు పటిష్ట ఏర్పాట్లు

వార్త 2లో..

నర్సీపట్నంలో ఘనంగా బాలోత్సవం

వార్త 8లో..

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మేరీ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1045వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఆశా వర్కర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మంది ప్రజల త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేసేందుకు మోడీకి హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. మోడీ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ పరిశ్రమలకు కాపలాదారుడు మాత్రమేనన్నారు. బిజెపి మిగతా 2లో..

ఎపిఇపిడిసిఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : వినియోగదారులకు సేవలందించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్)కు రెండు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా (ఇప్పయ్) ఆధ్వర్యంలో కర్ణాటకలోని బెల్గాంలో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ మేరకు ఎపిఇపిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తరపున సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం ఈ అవార్డులను అందుకున్నారు. ఇంధన రంగంలో విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ఉద్దేశించబడిన సరికొత్త కృత్రిమ మేధ (ఎఐ), మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ వంటి అంశాలపై చర్చించేందుకు బెల్గాంలోని శూన్య ఫార్మ్ రిట్రీట్‌లో ఇప్పయ్ ఆధ్వర్యంలో '24వ రెగ్యులెటరీ అండ్ పాలసీమేకర్స్ రిట్రీట్' పేరిట ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు సదస్సు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జరిగిన ఇప్పయ్ పవర్ అవార్డ్స్-2024 ప్రదానోత్సవ కార్యక్రమంలో ఇంధన రంగంలో వివిధ అంశాల్లో

అవార్డు స్వీకరిస్తున్న ఎపిఇపిడిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం

ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. సంస్థ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు ఎపిఇపిడిసిఎల్ జాతీయ స్థాయిలో అవార్డును కైవసం చేసుకుంది. దీంతో పాటు వినియోగదారుల్లో అవగాహన పెంపుదల అంశంలోనూ అవార్డును సొంతం మిగతా 2లో..

వివాహ శుభాకాంక్షలు

పెండ్లి కుమారుడు : చి॥ అనన్య (ఆది)
పెండ్లి కుమార్తె : చి॥ల॥సౌ॥ నిహారిక

అంబేద్కర్ కళాక్షేత్రం, సి.డబ్ల్యూ.సి.1, సెక్టార్-5,
ఉక్కునగరం, విశాఖపట్నం వద్ద
తేది :11-02-2024 ఆదివారం
ఉదయం గం. 10-00 ని॥లకు
వీరి వివాహ సందర్భముగా శుభాకాంక్షలు తెలుపుతూ...

అమ్మమ్మ : అప్పలనరసమ్మ
తల్లి, తండ్రి : కామేశ్వరమ్మ, బంగారినాయుడు
పెద్దమ్మ : అచ్చియమ్మ
చిన్నాన్న, పిన్ని : ఆర్.ఎల్.కె.నాయుడు, హైమ, తిరుపతి, అచ్చియమ్మ
మేనమామ : రామారావు, ఝూన్సీ, శ్రీనివాసరావు, శ్రావ్య
అక్క, మామ: దాలమ్మ (ఝూన్సీ), కృష్ణవేణి, శంకరరావు,
అన్నయ్య : సన్యాసినాయుడు, అరుణ
బంధువులు : గణేష్, అజయ్, రేష్మ, వరుణ్ ,
పిల్లలు : కారుణ్య, విజ్ఞు, చైతు, వర్జ్యోత్
మరియు బంధుమిత్రుల అభినందనలతో...

మొదటి పేజీ తరువాయి..

సాంకేతిక అడ్డంకులు

సచివాలయంలో 50 వరకు పట్టాలు రిజిస్ట్రేషన్లు జరగాల్సివుండగా సాంకేతిక సమస్యలతో పది రిజిస్ట్రేషన్లు కూడా కావడంలేదు. దీంతో ఉద్యోగులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. సకాలంలో రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చొని రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో రెండోరోజు రావాల్సి వస్తోంది. ఈ నెల ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించి 18 నాటికి ముగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గడువులోగా విధించిన లక్ష్యాల ప్రకారం రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని ఉద్యోగులు ఎంత ప్రయత్నించినా సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో పని మందకొడిగా సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో తలెత్తిన సమస్యలతో గడువులోగా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యే అవకాశం కనిపించడంలేదు. దీంతో తమ పట్టాలు గడువులోగా రిజిస్ట్రేషన్లు అవుతాయో, లేదోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం సాంకేతిక సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా రిజిస్ట్రేషన్లు పూర్తిచేస్తామని చెబుతున్నారు.

ఎపిఇపిడిసిఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

చేసుకుంది. రెండు జాతీయ అవార్డులు లభించడం పట్ల సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖల సహకారంతో ఇపిడిసిఎల్‌లో పలు రకాల పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సంస్థ ఉద్యోగులు, సిబ్బంది అత్యుత్తమ పనితీరుకు నిదర్శనంగా సంస్థ జాతీయ అవార్డులను సొంతం చేసుకుందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో వినియోగదారులకు మరిన్ని నాణ్యమైన సేవలందిస్తామన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి సైతం విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ, సంస్థను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు కృషి చేస్తామని తెలియచేశారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

హామీలు గాలికి..

తెలిపారు. టిడిపి, వైసిపిలతో బిజెపి ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడుపుతోందన్నారు. ఎన్నికల్లో రాజకీయ నాయకులు పంచే డబ్బు ప్రజలదే అన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కోరుకునే వారంతా కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు. ఆయా సభల్లో మాజీ పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, మాజీ కేంద్ర మంత్రులు జెడి శీలం, ఎం.పల్లంరాజు, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్, పిసిసి రాష్ట్ర కార్యదర్శి రుత్తల శ్రీరామ్మూర్తి, సీనియర్ నాయకులు మీసాల సుబ్బన్న, వేగి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

షర్మిల సభలతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపైంది. చింతపల్లిలో జరిగిన సభకు సుమారు 5 వేల మంది గిరిజనులు తరలివచ్చారు. అక్కడ సభలోనే రాష్ట్రంలో పోటీ చేసే తొలి కాంగ్రెస్ అభ్యర్థిని షర్మిల ప్రకటించారు. పాడేరు అభ్యర్థిగా వంతల సుబ్బారావు పేరును ప్రకటించి కార్యకర్తల్లో ఆమె ఉత్సాహం నింపారు. అల్లూరి సీతారామరాజు గురించి పదేపదే చెబుతూ ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ట్రైకార్ ఛైర్మన్ బుల్లిబాబు

పాడేరు నియోజకవర్గంలో వైసిపికి గట్టి షాక్ తగిలింది. పార్టీ ఆవిర్భావం నుంచీ ఆ పార్టీకి విధేయునిగా ఉంటూ వచ్చిన ప్రస్తుత ట్రైకార్ ఛైర్మన్ శతక బుల్లిబాబు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికలలో గిడ్డి ఈశ్వరి, 2019 ఎన్నికలలో కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలు ఎమ్మెల్యేలుగా గెలుపొందేందుకు బుల్లిబాబు కృషి చేశారు. 2024లో తనకు టిక్కెట్ వస్తుందని ఆయన ఆశించారు. నెరవేరే ఆశ కనిపించకపోవడంతో 70 మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క ప్రభుత్వరంగ సంస్థనూ స్థాపించలేదన్నారు. దీక్షల్లో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి, కోశాధికారి వై.సీతారత్నం, సరోజిని, కె.ఆదిలక్ష్మి, కె.నవ్య, బి.లీలావతి, పి.పార్వతి, బి.భారతి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి తొత్తుగా విశాఖ కలెక్టర్ : టిడిపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున అధికార వైసిపికి తొత్తుగా పని చేస్తున్నారని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆరోపించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ మల్లికార్జునను ఎన్నికల విధుల నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి, ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నగరంలో వందల కోట్ల విలువైన దసపల్లా, హయగ్రీవ భూములు కలెక్టర్ నిర్వాకంతో అధికార పార్టీ నేతల పరమయ్యాయన్నారు. అధికార పార్టీ నేతలకు అనుకూలంగా విఎంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్ మార్పు జరిగిందన్నారు. రామానాయుడు స్టూడియోలో ఇళ్ల కోసం లే అవుట్ వేసారన్నారు. టిడిపి సానుభూతిపరుల ఓట్లను ఇష్టానుసారంగా తొలగించేశారని తెలిపారు. దొంగ ఓట్లను ఇష్టానుసారంగా చేర్చారని విమర్శించారు.

డాక్టర్ రవిరాజుకు మహోపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ పూర్వ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కెజిహెచ్ మాజీ సూపరింటెండెంట్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ టి.రవిరాజుకు మరో అవార్డు లభించింది. కిడ్నీ రోగులకు అందిస్తున్న విశేష సేవలను గుర్తించి ఆయన్ని తెలంగాణా గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ 'మహోపాధ్యాయ' అవార్డుతో సత్కరించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ సదరన్ చాప్టర్ వార్షిక సదస్సు ప్రారంభోత్సవ వేడుకల్లో డాక్టర్ రవిరాజు ఈ అవార్డును అందుకున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రజాందోళనలు పట్టవా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తిచేశాం' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పదేపదే సభల్లో చెప్పడం అతిశయోక్తి మినహా మరొకటి కాదు. రాష్ట్రంలో గడచిన 57 నెలలుగా పలు తరగతుల సంక్షేమానికి 124 సార్లు బటన్ నొక్కానంటూ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) గురించి వల్లెవేయడం అందరికీ తెలిసిందే. కానీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేస్తూ, పలు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మాత్రం ప్రభుత్వం 'బటన్' నొక్కడం లేదు. ఇలాగే మొండిగా సిఎం ముందుకెళ్తే ఈ ఎన్నికల్లో గట్టిబుద్ధిచెబుతామంటూ చిరు ఉద్యోగులు మరలా ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

హామీల అమల్లో నిజమెంత?

మరోవైపు ప్రతిపక్షాల వాదన చూస్తే జగన్ ఇచ్చిన 730 హామీల్లో 109 అంటే 15 శాతమే అమలు చేసి 99 శాతం అని చెప్పుకోవడం ఏమి రాజనీతి? అంటూ ప్రశ్నిస్తున్నారు. విశాఖ జిల్లాలోనే చూసుకుంటే నిరుద్యోగుల ఆశలపై పూర్తిగా ప్రభుత్వం నీళ్లు చల్లింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేల పైచిలుకు పోస్టుల్లో ఉమ్మడి జిల్లాలకు చాలా చోట్ల వందకు అటు ఇటుగా టీచర్ పోస్టులను కేటాయించారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో 20 వేల మందికి పైగా టీచర్ పోస్టులకు అర్హులు క్యూ కట్టి ఉంటుండగా తక్కువ పోస్టులను ప్రభుత్వం తీయడం అన్యాయమని నిరుద్యోగులంతా మండిపడుతూ ఆందోళనలు చేపడుతున్నారు. విశాఖ జిల్లాలో వందల సంఖ్యలో కోచింగ్ సెంటర్లలో నిరుద్యోగ సైన్యం రూ.లక్షలు వెచ్చించి టీచర్ పోస్టుల కోసం

శిక్షణ పొందుతున్నారు. వీరి ఆశలపై ప్రభుత్వం నీళ్లు జల్లింది. మొన్నటివరకూ పోరాడిన అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సమగ్ర శిక్ష అభియాన్, మున్సిపల్ వర్కర్లకు ఇచ్చిన హామీలపై ఇంకా సరైన రీతిలో జగన్ ప్రభుత్వం బటన్ నొక్కలేదన్నది వాస్తవం. ఇటీవల వీరు చేసిన ఆందోళనల రోజులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం జీతాల్లో కోత విధించడం వీరిని మరింత బాధించింది. దీంతో మరో దఫా ఆందోళనలకు వీరు సిద్ధమవుతున్నారు. ఆశా వర్కర్లంత కనీస వేతనాలు, హక్కుల కోసం పోరాడుతున్న తరుణంలో వారిపై నిర్బంధాన్ని ప్రయోగించడానికే జగన్ సర్కారు సిద్ధమైంది. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ జగన్ సర్కారు ఈ చిరుద్యోగుల విషయంలో అమలు చేయనందున తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై ఈ తరగతులంతా అసహనం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కుతున్నాయి.

ప్రభుత్వ టీచర్లకు ఒపిఎస్ ఇస్తానని చెప్పి వారిని ముప్పతిప్పలు జగన్ పెడుతున్నారు. దీంతో టీచర్లంతా పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. 2024 ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే పాతపెన్షన్ హామీకి కట్టుబడి ఉంటుందో వారికే రాష్ట్రంలో టీచర్లంతా ఓటు వేస్తారంటూ ప్రభుత్వానికి అల్టిమేటంను టీచర్ల సంఘాలు ఇచ్చాయి.

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను సైతం నేటికీ జగన్ ప్రభుత్వం అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న జరిగే పారిశ్రామిక సమ్మెలో విశాఖ కేంద్రంగా ఈ తరగతులన్నీ మరో కార్మిక, ఉద్యోగ ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి.

ఎఐ క్లౌడ్ సమ్మిట్‌కు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో ఎఐ క్లౌడ్ సమ్మిట్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో నేరగాళ్ళ సాంకేతిక రంగంలో అందరికన్నా ముందున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, ఇది కేవలం నేరస్తులను గుర్తించేందుకు మాత్రమే కాకుండా నేరాల నివారణకు, పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేటివ్ సొసైటీ సిఇఒ అనిల్ కుమార్, డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ శ్రీధర్ కోసరాజు, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా అడిషనల్ డైరెక్టర్ బి సురేష్, అధ్యక్షురాలు లక్ష్మీ ముక్కవల్లి పాల్గొన్నారు.

ఆడుదాం - ఆంధ్ర ముగింపు వేడుకకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విశాఖ నగరానికి ఈ నెల 13న రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నగరంలోని తాటిచెట్లపాలెం, మర్రిపాలెం, ఎన్ఎడి, గోపాలపట్నం, వేపగుంట, చినముషిడివాడ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. పిఎం.పాలెం క్రికెట్ స్టేడియంను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. సెంటర్ మీడియన్‌లలో మొక్కలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించారు.

మార్చి 25న మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మానవ హక్కుల కౌన్సిల్ 25వ రాష్ట్ర స్థాయి సదస్సును మార్చి 25న విజయవాడలో నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం మానవ హక్కుల కౌన్సిల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మానవ హక్కుల కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ పౌరులకు అందుబాటులోలేవని, వాటి ఉనికి ప్రశ్నార్థకంగా ఉందని తెలిపారు. హక్కుల ఉల్లంఘనలతో బాధితులు అవుతున్నవారికి ఉపశమనంగానీ, నష్టపరిహారంగానీ లభించడం లేదన్నారు. మానవ హక్కులు, మహిళల హక్కులు, బాలల హక్కుల కోసం ఏర్పాటు చేసుకున్న స్వచ్ఛంద సంస్థలు వ్యాపార వాణిజ్య సంస్థలుగా పనిచేస్తూ, అమాయకులను ప్రలోభ పెట్టి దోచుకుంటున్నాయని ఆవేదన వెలిబుచ్చారు.

రక్షణ పరికరాలపై ఎంఎస్ఎంఇతో జిందాల్ ఎంఒయు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : దేశంలో రక్షణ, అంతరిక్ష పరికరాల తయారీ చేసే దిశగా జిందాల్ స్టెయిన్‌లెస్ కంపెనీ విశాఖపట్నంలోని ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్‌తో శనివారం వ్యూహాత్మక వస్తు సరఫరా ఎంఒయు కుదుర్చు

ఒప్పంద పత్రాలతో ప్రతినిధులు

కుందని జిందాల్ డైరెక్టర్ అభ్యుదయ్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ దిగుమతులపై ఆధారపడడం తగ్గించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని, రక్షణ, అంతరిక్షణ ఉత్పత్తుల తయారీలో నాణ్యతకు పెద్దపీట వేస్తామని వెల్లడించారు. విశాఖపట్నంలోని స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఇ)లను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. విశాఖపట్నం ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ అధిపతి జి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ స్టీల్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న జిందాల్‌తో కలిసి పనిచేయడం నైపుణ్యాభివృద్ధి, శిక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. వినూత్నమైన అంతరిక్ష పరిశోధన, సామర్థ్యం, ఏరోస్పేస్ రంగాలకు మంచి ఉత్పత్తులను అందిస్తామని తెలిపారు. ఎంఎస్ఎంఇ ప్రాంగణంలో జరిగిన ఈ వ్యూహాత్మక ఒప్పందంలో ఏరోస్పేస్ కల్నల్ (రిటైర్డ్) పియూష్ వర్మ, మార్కెటింగ్ హెడ్ అమిత్ గోయల్‌లు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT GAJUWAKA
S.O.P.07/2023

Between:
1.Sri.Pulagapuri Anil Kishore
2.Sri.Pulagapuri Raju
. . . Petitioners.
And:
1. M/s. Sahara Credit Co-Operative Society Ltd. U.P,
2. M/s. Sahara Credit Co-Operative Society Ltd. Gajuwaka.
. . . Respondents.

PUBLIC NOTICE

The public in general are hereby informed that the above named petitioners filed the above petition to issue Succession Certificate in favour the petitioners, enabling them to receive the petition mentioned amount from the respondents in their names which is stands in the name of Pulagapuri Varahalamma @ Kammara Varahalamma who died on 12/11/2021. The above matter stands posted to 29-02-2024

Therefore the public in general are hereby informed that if anybody having objections in the above matter please appear before the Hon'ble Court on **29-02-2024 at about 10.30 AM** and submit objections in writing, failing which the matter will be decided exparte in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)

M.PATTABHI RAMA RAO, L.MADHAVI, B.SUDHAKAR, J.HEMA NIKHITHA Advocates, Gajuwaka, Visakhapatnam. Mobile No: 9246625602

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT GAJUWAKA.
S.O.P.08/2023.

Between:
1.Sri.Pulagapuri Anil Kishore,
2.Sri.Pulagapuri Raju.
. . . Petitioners.
And:
1. M/s. Sahara Credit Co-Operative Society Ltd. U.P 2.
2. M/s. Sahara Credit Co-operative Society Ltd. Gajuwaka.
. . . Respondents.

PUBLIC NOTICE

The public in general are hereby informed that the above named petitioners filed the above petition to issue Succession Certificate in favour the petitioners, enabling them to receive the petition mentioned amount from the respondents in their names which is stands in the name of Pulagapuri Apparao who died on 13/01/2023. The above matter stands posted to 29-02-2024.

Therefore the public in general are hereby informed that if anybody having objections in the above matter please appear before the Hon'ble Court on **29-02-2024 at about 10.30 AM** and submit objections in writing, failing which the matter decided exparte in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)

M.PATTABHI RAMA RAO, L.MADHAVI, B.SUDHAKAR, J.HEMA NIKHITHA Advocates, Gajuwaka, Visakhapatnam. Mobile No: 9246625602

మట్టి పోశారు.. కాలువలు మరిచారు...

ప్రజాశక్తి -ఆనందపురం : శ్రమజీవుల కాలనీలోని బాలికల వసతి గృహం రోడ్డు అధ్వానంగా తయారైంది. అధికారులు రోడ్డు నిర్మిస్తామని చెప్పి రెండు నెలల క్రితం సుమారు రూ.8 లక్షల కేటాయించి గ్రావెల్ పోసి తర్వాత పనులను గాలికి వదిలేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీవాసుల వాడుక నీరు పోవడానికి కాలువ లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు కూపంగా తయారవుతోంది. వర్షపు నీరు, మురుగు నీరు పోవడానికి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డు అధ్వానంగా మారింది. ఈ విషయమై అనేకసార్లు అధికారులకు చెప్పినప్పటికీ పనులు ముందుకు కదలడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రోడ్డ పరిస్థితి ఇలా ఉంటే దూర ప్రాంతాల్లో ఉన్న రోడ్లు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులు మండిపడుతున్నారు. ఈ రోడ్డు గుండా బాలికలు వసతి గృహానికి వెళ్లాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలు, రోడ్డు నిర్మించాలని శ్రమజీవుల కాలనీ వాసులు, హాస్టల్ విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు

17లోగా టెట్ ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9వ తేదీ వరకు నిర్వహించనున్న టీచర్స్ ఎలిజిబులిటి టెస్ట్ (టెట్) పరీక్ష రుసుము ఈ నెల 17వ తేదీ లోపు చెల్లించాలని డిఇఒ ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న మాక్ టెస్ట్ ఉంటుందని, హాల్ టిక్కెట్లను ఈ నెల 23 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రాథమిక కీ మార్చి 10న విడుదల చేయనున్నట్లు తెలిపారు. దీనిపై అభ్యంతరాలు మార్చి 11న స్వీకరించి మార్చి 13న ఫైనల్ కీ, 14న తుది ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

విసి ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న మందారెడ్డి, శ్రీదేవి

ఎయు విసిని కలిసిన మందారెడ్డి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డిని విశాఖ జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యులు వారధి శ్రీదేవి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెండో సారి వీసీగా నియమితులైనందుకు ఆయనను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఉత్తరాలను పోస్టు బాక్సులో వేస్తున్న ఉపాధ్యాయులు

పాత పెన్షన్ హామీని మ్యానిఫెస్టోలో చేర్చాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి ఆధ్వర్యాన పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయులు రాసిన ఉత్తరాలను వైసిపి, టిడిపి, జనసేన, కాంగ్రెస్ అధ్యక్షులకు పోస్టు ద్వారా పంపించారు.

ఈ కార్యక్రమంలో హనుమంత వాక పాఠశాల ప్రధానో పాధ్యాయులు పార్వతి, ఉపాధ్యాయులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పరిధి ఆరిలోవలోని అన్నానగర్, గాంధీనగర్, శ్రీహరినగర్ తదితర ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శనివారం శంకుస్థాపన చేశారు. అన్నానగర్‌లో సుమారు రూ.15.25 లక్షలతో సిసి రోడ్డు, కాలువలు, 11 లక్షలతో కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం, గాంధీనగర్లో రూ.46.20 లక్షలతో సామాజిక భవనం ఆధునీకరణ, శ్రీహరినగర్‌లో రూ.17.30 లక్షలతో సిసి రోడ్డు, 9.70 లక్షలతో తారు రోడ్డు, శ్రీహరినగర్, కైలాస్‌నగర్ ప్రాంతాలలో రూ.10.52 లక్షలతో సిసి రోడ్డు, కాలువలు, మెట్లు మార్గం తదితర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు మేయర్ తెలిపారు. నగరంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖ సుందర నగరంగా రూపుదిద్దుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాసరావు, జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధిలో రూ.1.15 కోట్లతో పలు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. రాజీవ్‌గృహకల్ప, బొట్టవానిపాలెం తదితర ప్రాంతాల్లో సుమారు రూ.14.70 లక్షలతో సీసీ డ్రెయినేజీల నిర్మాణం, మారికవలస ఆంజనేయ స్వామి గుడి నుంచి వైట్ బిల్డింగ్ వరకు రూ.35 లక్షలతో బిటి సర్వీస్ రోడ్డు, రూ.30 లక్షలతో వైఎస్‌ఆర్ కాలనీ నుంచి కొమ్మాది పెట్రోల్ బంక్ వరకు బిటి రోడ్డు, రూ.30 లక్షలతో బొట్టవానిపాలెంలో రోడ్డు, డ్రెయినేజ్ పనులు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో సిసి.రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, విద్యుత్, తదితర సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ మొల్లి హేమలత మాట్లాడుతూ వార్డులో మౌలిక వసతులు కల్పించాలని కౌన్సిల్ సమావేశాల్లో మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని, తద్వారా రూ.4 కోట్ల జివిఎంసి నిధులతో వార్డులో శ్మశాన వాటికలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు మొల్లి లక్ష్మణరావు, వైసిపి నాయకులు పోతిన హనుమంతరావు, పోతిన శ్రీను, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

95 మంది రక్తదానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, ఒఎన్‌జి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యాన శనివారం స్థానిక బ్యాంక్ కాలనీ సమీపంలోని సన్ స్కూల్ వేదికగా నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరంలో 95 మంది రక్త దానం చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో చేపట్టిన ఈ శిబిరంలో అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, బ్లిస్ కేటరింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీలావణ్య, సభ్యులు డాక్టర్ ఎన్ఎల్.రావు, గంటా నూకరాజు, ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్నీ, రాజేటి బసవ కృష్ణమూర్తి, రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.కల్యాణ్‌రామ్, డాక్టర్ వి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

175 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఇదే స్కూల్ వేదికగా శంకర్ ఫౌండేషన్ సహకారంతో భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, ఒఎన్‌జి ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 175 మందికి వైద్యులు నేత్ర పరీక్షలు చేశారు. ఇందులో 48 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యులు డాక్టర్ రత్నంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి అనుబంధ విభాగాల సమావేశం

ప్రజాశక్తి -మధురవాడ : వైసిపి అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌ఛార్జిలు, అధ్యక్షులతో శనివారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు మళ్ల విజయ్‌ప్రసాద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుబంధ విభాగాలు బలోపేతంగా ఉంటే పార్టీ సునాయాసంగా విజయం సాధిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో అనుబంధ విభాగాలు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి బూత్‌లోనూ అనుబంధ విభాగాల సభ్యులు ఉండేలా ప్రణాళికలు తయారుచేసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. 2024 ఎన్నికల తర్వాత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమే వస్తుందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు మాట్లాడుతూ, పార్టీ విజయం కోసం మనమంతా అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ముత్తంశెట్టి వెంకటశివసాయి నందీష్, వంకాయల మారుతీ ప్రసాద్, నాగిరెడ్డి కిరణ్, పూర్ణానందశర్మ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

104 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి సరిపల్లి జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించే క్రమంలో మహారాష్ట్రకు చెందిన ఇన్నోవా వాహనంలో అక్రమంగా తరలుతున్న 104 కిలోల గంజాయిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ వెంకటరావు సారథ్యంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ టాస్క్‌ఫోర్స్ వి.ప్రసాదరావు, సిఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు ఇన్నోవా కారును, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం పెందుర్తి పోలీసులకు నిందితులను అప్పగించారు.

మద్యం అక్రమ నిల్వలు పట్టివేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టాస్క్‌ఫోర్సు ఎసిపి వి.ప్రసాదరావు, సిఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసి అక్రమంగా ఉన్న 88 బాటిళ్ల డిఫెన్స్ మద్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మనబాలపాలెం గ్రామానికి చెందిన బొడ్డపు శ్రీను రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... శనివారం ఉదయం మనబాలపాలెం నుండి జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి వస్తుండగా వెనుక నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే శ్రీను మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భూములకు రక్షణ కల్పించాలని వినతి

ప్రజాశక్తి -తగరపువలస : ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో ఉన్న తమ భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ జనార్దనరావుకు బాధితుల్లో కొందరైన అంగటి జట్లయ్య, దువ్వ పైడిరాజు, కె.శ్రీను, ఎం.నారాయణ వినతిపత్రం అందజేశారు. దాదాపు 15 ఎకరాలున్నతమ భూమిలో ఇష్టారీతిన గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని వివరించారు. తమరు జోక్యం చేసుకుని తమ భూములకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2023పై చిట్టివలసలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సుకు హాజరైన జనార్దనరావు, మరికొందరు న్యాయవాదులకు వినతిపత్రం అందజేసినట్లు బాధితులు తెలిపారు.

ఒకటో వార్డులో భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి బంగ్లామెట్టలో జనసేన వార్డు అధ్యక్షులు పరిమి భువనేశ్వరి శనివారం పర్యటించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామ్మోహన్, శేఖర్ పాల్గొన్నారు.

200 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గిడిజాల సాయి గణపతి కళాశాలలో శనివారం విద్యార్థులకు సంధ్య కంటి హాస్పిటల్ సౌజన్యంతో ఉచితంగా 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్ మహేశ్వరరావు మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులకు, డ్రైవర్లకు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు నిర్వహించిన సంధ్య హాస్పిటల్స్ సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతూ వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.మహేశ్వరరావు, డాక్టర్ బాపిరాజు, ఎన్ఎస్ఎస్ పిఒ అనిల్‌కుమార్, హాస్పిటల్ మార్కెటింగ్ హెడ్ టీవీ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం పంచాయతీలోని మహాగణపతి మహాలక్ష్మి సమేత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ఏడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పద్మనాభం ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తలంక సంతోష్‌కుమార్‌శర్మ ద్వారా అమ్మవారి గర్భాలయంలో పంచామృత అభిషేకం, గణపతి పూజ, తోమాలసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 మంది ముత్తైదువులచే కుంకుమ పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు 102 కలశాలతో అమ్మవారి ఉత్సవ ఊరేగింపు చేశారు. 2000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు ఈ కార్యక్రమంలో ఎ.శ్రీనివాసరావు, ఎన్.సత్యకృష్ణ, కె.వెంకటనారాయణమూర్తి, ఎం.సుందరరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పద్మ

మహిళలు, చిన్నారుల రక్షణపై అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : ఐద్వా ఆధ్వర్యాన మహిళలు, చిన్నారుల రక్షణపై, మద్యం నియంత్రణపై శనివారం స్వతంత్రనగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ, ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటుచేయడం వల్ల యువత మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని, మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలుచేయాలని డిమాండ్‌చేశారు. త్వరలో జరగనున్న ఐద్వా జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, శ్రీదేవి, సంతోషం పాల్గొన్నారు.

పరీక్ష అట్టలతో విద్యార్థులు

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-పెందుర్తి : మేఘాద్రిగెడ్డలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో ఆంధ్రప్రదేశ్ పూర్వ విద్యార్థుల సంఘం (స్వేరోస్) ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్, రోటరీ క్లబ్ మెట్రో ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ స్పీకర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రణాళికతో చదివితే విజయం సాధిస్తారన్నారు. పదో తరగతి మొదటి మెట్టు అని, ఇక్కడి నుంచి జీవితానికి సంబంధించిన లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరడానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.మృదులప్రియదర్శిని, ప్రెసిడెంట్ డాక్టర్ గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ రవిప్రసాద్, స్వేరోస్ పూర్వ విద్యార్థుల ప్రతినిధి కనకరాజు, శంకర్, శ్రీనివాసరావు, గణేష్, శివలక్ష్మి పాల్గొన్నారు.

సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

92వ వార్డులో బాబు ష్యూరిటీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి రజకకాలనీలో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, మినీ మేనిఫెస్టోలో చంద్రబాబు పెట్టిన భవిష్యత్తు గ్యారంటీ సామాన్య మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారని, ప్రశాంత విశాఖలో హత్యలు చూసి వణికి పోతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ప్రజలకు, అధికారులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. అనంతరం బాబు ష్యూరిటీ పేరిట ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు మూర్తి పట్నాయక్, నాయకులు రమేష్, నారిపిన్ని సత్తిరాజు, కొల్లి అప్పారావు, కనక, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మీడియా-సామాజిక న్యాయం' పై సదస్సు

ప్రజాశక్తి-సీతమ్మధార : అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యాన అంబేద్కర్ భవన్‌లో శనివారం 'మీడియా-సామాజిక న్యాయం' అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభంలో అంబేద్కర్ చిత్రపటానికి అతిథులు, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రముఖ రచయిత, కవి, ఏపీ జర్నలిజం కాలేజీ డైరెక్టర్ సతీష్ చందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పత్రికలు వాస్తవాన్ని వక్రీకరిస్తూ నిజాన్ని మరుగునపడేటట్లు చేస్తున్నాయన్నారు. ప్రచార మాధ్యమాలు బలవంతంగా తమ అభిప్రాయాలను మనమీద రుద్దుతున్నాయని అభిప్రాయపడ్డారు. దేశ వ్యాప్తంగా అనేక అకృత్యాలు ప్రస్తుతం మీడియాలో కానరావట్లేదన్నారు. దళితుల బతుకులు, వారి జీవితాలు పత్రికల్లో కనిపించట్లేదన్నారు. అగ్రవర్ణాల చేతుల్లో ఉన్న కొన్ని పత్రికలు పార్టీలకు కొమ్ము కాస్తూ వారిని రాజకీయంగా ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో దళితులను చైతన్యవంతం చేసేందుకు అంబేద్కర్ మూక్ నాయక్ పత్రికను స్థాపించారని తెలిపారు. మతోన్మాద పార్టీలు దేశమంతా దేశభక్తి అంటే రామభక్తి అని ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రధాన మీడియా ఇదే చూపిస్తోందని విమర్శించారు. బహుజనులు ప్రచార మాధ్యమాల ద్వారా అంబేద్కర్ ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు.

ఏయూ జర్నలిజం విభాగం పూర్వ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.బాబీవర్ధన్ మాట్లాడుతూ, 'మూక్ నాయక్' పత్రికను అగ్రవర్ణాల పత్రికలకు ధీటుగా ఆనాడు అంబేద్కర్ నడపడం సాహసోపేతమని కొనియాడారు. నేడు మీడియా ఫోర్త్ ఎస్టేట్‌గా కాకుండా రియల్ ఎస్టేట్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

'లీడర్' సంపాదకులు వీవీ.రమణమూర్తి మాట్లాడుతూ, నేడు మతవాదులు అంబేద్కర్ రాజ్యాంగాన్ని తీసివేసి మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి కుట్ర పన్నుతున్నారని, అందరూ జాగరూకతతో వ్యవహరించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సొసైటీ అధ్యక్షులు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే దేశానికి జర్నలిజం వచ్చిందని, అది అంబేద్కర్ అందిపుచ్చుకొని ఆనాటి బలహీన వర్గాల సమస్యలను వెలుగులోకి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి జెవి.ప్రభాకర్ సీనియర్ జర్నలిస్ట్ జికెడి.ప్రసాద్, ఏయూ ప్రొఫెసర్ పీడీ సత్యపాల్, డాక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఏపీ జర్నలిజం కాలేజ్ డైరెక్టర్ సతీష్ చందర్

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : నేడున్న ప్రత్యేక పరిస్థితుల్లో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో శనివారం కేథరిన్ విద్యాసంస్థల 40వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల అమలు వేగవంతం అవుతున్న తరుణంలో విద్యా రంగంలో కూడా అనేక రకాల సంస్కరణలు చోటు చేసుకున్నట్లు తెలిపారు. కేథరిన్ విద్యా సంస్థలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుండడం అభినందనీయమని కొనియాడారు.

ఎపిపిఎస్‌సి సభ్యులు సోనీ ఉడ్ మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లో కూడా కేథరిన్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభా పాటవాలు కనబరుస్తుండడాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కేథరిన్ విద్యా సంస్థల డైరెక్టర్ ఆలివర్ రాయి అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ సభలో సంస్థ వ్యవస్థాపకులు ఆర్‌డి.రత్నరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దీక్షల విజయవంతంపై పెన్షనర్ల ధన్యవాదాలు

ప్రజాశక్తి -ములగాడ : వెంకన్నపాలెంలోని సిఐటియు కార్యాలయంలో ఇపిఎఫ్- 95 పెన్షనర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఎపిసిసి పిలుపుమేరకు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు మర్రిపాలెంలోని పిఎఫ్ ఆఫీసు వద్ద నిర్వహించిన దీక్షలను విజయవంతం చేసిన అందరికీ ధన్యావాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం నాయకులు కె.నూకరాజు, ఎస్‌కె.హుస్సేన్ తదితరులు మాట్లాడుతూ, దీక్షల అనంతరం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చి ప్రస్తుత పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ హయ్యర్ పెన్షన్ మీద క్యాలిక్యులేషన్‌పై తమకు ఇంకా ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారని వివరించారు. ఇపిఎఫ్ ఖాతాలో రూ.ఏడు లక్షల 75 వేల కోట్లు కార్పస్ అమౌంట్‌గా ఉందని, దానిపై వడ్డీ రూ.52 వేల కోట్లు వస్తుందని తెలిపారు. 75 లక్షల మందికి ఇస్తున్న సరాసరి పెన్షన్ రూ.1592 మాత్రమేనని ఆ లెక్కన వారికిస్తున్న మొత్తం రూ.14 వేల కోట్లు మాత్రమేనని వివరించారు. మిగతా మొత్తం కార్పస్ అమౌంట్‌లో కలుస్తుందని తెలిపారు. రూ.52 వేల కోట్లు వస్తున్న వడ్డీ మొత్తాన్ని ఇపిఎఫ్ 95 పెన్షనర్లకు చెల్లిస్తే ఇప్పుడు ఇస్తున్న దానికన్నా రెండు, మూడు రెట్లు ఎక్కువ ఇవ్వచ్చని చెప్పారు. ప్రభుత్వం ఆ రకమైన చర్యలు చేపట్టడానికి సిద్ధంగా లేదన్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు మన పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

తహశీల్దార్ జయకు సత్కారం

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న కొర్ర జయకు సిబ్బంది ఆత్మీయ సత్కారం చేశారు. బుచ్చిరాజుపాలెం తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ జగదీశ్వరరావు అధ్యక్షతన శనివారం సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటుచేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ విజయభాస్కర్‌తో కలిసి సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, సాలువతో సత్కరించి జ్ఞాపికను, సన్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు విధి నిర్వహణలో ఆమె అందించిన సేవలను కొనియాడారు. క్లిష్టతరమైన విశాఖ విమానాశ్రయం ప్రోటోకాల్ విధులను సమర్థవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీటీ సువర్ణబాయి, ఆర్ఎస్ డీటీ వరలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, విఆర్‌ఒలు సుబ్రహ్మణ్యం, నవీన్, సాహితీ, జూనియర్ అసిస్టెంట్ ఎ.రోహిత్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వంశీ, విఆర్‌ఎలు, సచివాలయ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ జయను సన్మానిస్తున్న సిబ్బంది

సంక్షేమం, అభివృద్ధిని వివరించండి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు తెలిసేలా కృషి చేయాలని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కె.కె.రాజు చెప్పారు. జివిఎంసి 53వ వార్డుకు సంబంధించిన పోలింగ్ బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకులతో వార్డు పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి కెకె.రాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేసిన పనులను వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు మాస్టర్, అమర్ రెడ్డి, షేక్ బాబ్జి, హనుమంత్, రామలక్ష్మి, జ్ఞానేష్, తదితరులు పాల్గొన్నారు.

44వ పోలింగ్ బూత్ ఏజెంట్లు ముఖ్య నాయకులతో వార్డులోని సాధికాన కల్యాణమండపంలో ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావుతో కెకె.రాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకునే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ శ్రేణులకు, సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అబీబ్, సీతారాములు, భషీర్, జి.వెంకటరావు, కన్నపడు కిషోర్ పాల్గొన్నారు.

మర్రిపాలెంలో ఉర్సు పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 53వ వార్డు పరిధి మర్రిపాలెం వాటర్ ట్యాంక్ వద్ద హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉర్సు పండుగ కెజిఎన్ యూత్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు హాజరై ముస్లిం పెద్దలు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలి, షేక్ బాబ్జి,హనుమంత,సదరం జ్ఞానేష్,షేక్ నబీ, వల్లి, అనిల్, భార్గవ్, సంపత్, కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థినికి స్థానిక జమ్మి చెరువు వాకర్స్ సభ్యులు శేషాద్రి శనివారం రూ.10 వేలు సాయం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్ధనరావు, వాకర్స్ సభ్యులు, విశ్రాంత మున్సిపల్ ఉద్యోగి శంకర్ కుమార్ ద్వారా ఈ సాయం అందజేశారు.

12న భారీ మానవహారాన్ని జయప్రదం చేయండి

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ కన్వీనర్ రామసదాశివరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డును వెంటనే పునర్నిర్మించాలని, ఈ మార్గంలో భారీ వాహనాలు నిలుపుదల చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ ఈనెల 12న జరిగే భారీ మానవహారంలో ప్రజలందరూ పాల్గొనాలని జయప్రదం చేయాలని రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ కన్వీనర్ కాండ్రేగుల రామ సదాశివరావు పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, చోడపల్లి తదితర గ్రామాలలో శనివారం మానవహారంపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12న సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నాగులపల్లి నుంచి అచ్చుతాపురం వరకు ప్రజల అందరితో భారీ మానవహారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే మునగపాక, అచ్చుతాపురం మండలాల్లో అనేక గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్లు, ప్రతి గ్రామం భారీగా ప్రజలు తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ రోడ్డు గోతుల్లో పడి అనేకమంది మృత్యువాత పడ్డారని, క్షతగాత్రులవుతున్నారని, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఏళ్ల తరబడి రోడ్డు నిర్మాణం పూర్తి చేయకుండా తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. 12న మానవహారం తరువాత కూడా ప్రభుత్వం సమస్య పరిష్కారం చేయకపోతే ప్రజలందరి సహకారంతో నిరవధిక రోడ్డు దిగ్బంధనం, బంద్‌కు కూడా వెనకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కర్రి అప్పారావు, ఎస్ కన్నంనాయుడు, బుద్ధ రంగారావు, కె వెంకటరమేష్, సిఐటియు మండల కన్వీనర్ కే సోమునాయుడు, డి శ్రీను, కె ప్రసాద్, డి ఉమా, పి నూకరత్నం, పి సత్యవతి, ఎం లక్ష్మి, కే మంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న రామసదాశివరావు

మునగపాక : ఈనెల 12న జరిగే మానవహారాన్ని జయప్రదం చేయాలని కోరుతూ రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఒంపోలు గ్రామంలో శుక్రవారం రాత్రి స్థానిక యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, ఎస్ బ్రహ్మాజీలు మాట్లాడుతూ రోడ్డు పునర్నిర్మాణం చేయాలని జనవరి 30 నుండి సంతకాల సేకరణతో పాటుగా బాధిత గ్రామాల పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 12న నాగులపల్లి నుండి అచ్యుతాపురం వరకు ఏ గ్రామంలో ప్రజలు ఆ గ్రామంలో రోడ్డుకి ఇరువైపులా మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలియజేయాలని కోరారు.

భవనాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం బూడి

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మాడుగుల నియోజకవర్గంలో అంతర్గత రహదారులన్నీ అద్దంలా ఉన్నాయని, గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బికెలు, ఆరోగ్య కేంద్రాలు స్వాగతం పలుకుతుంటాయని, ఇంతటి అభివృద్ధిని చూసి తెలుగుదేశం, జనసేన నాయకులు ఓర్వలేకపోతున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని 12 గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను శనివారం బూడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఏ గ్రామంలో పర్యటించినా మహిళలు, వృద్ధులు చిరునవ్వుతో స్వాగతం పలుకుతారని, దీన్ని బట్టి వారు ఎంత సంతోషంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. మాడుగుల నియోజకవర్గంలో ఎక్కడైనా మట్టిరోడ్డు కనిపిస్తే తనకు చూపించాలన్నారు. అంతకుముందు కోటి 60 లక్షలతో ఆధునికీకరించిన లంకవానిపాలెం పిహెచ్‌సిని, వారాడ, ఆర్‌వై అగ్రహారం, కే సంతపాలెం, కింతాడ, గుల్లేపల్లి, గొండుపాలెం గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను, రామచంద్రపురం నుండి లంకవానిపాలెం, గొండుపాలెం నుండి మురుగుపాలెం బీటి రోడ్లను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటి కుళాయిలు, వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పిటిసి ఈర్లే అనురాధ, ఆయా గ్రామ సర్పంచులు వేచలపు దొరబాబు, బండారు ఈశ్వరమ్మ , చల్లా మంగ, బి కనకమల్లేశ్వరి, ఎంపిటిసిలు రొంగలి సూర్యనారాయణ, వర్రి రామునాయుడు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి అచ్యుతాపురం : శ్రీవిష్ణు హాస్పిటల్ 5వ వార్షికోత్సవం సందర్భంగా సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అచ్యుతాపురంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఏ సుధీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఇషాన్ హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ధర్మారెడ్డి వెంకట్, మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ సుభద్ర, గైనకాలజీ డాక్టర్, డాక్టర్ సందీప్, డాక్టర్ సత్య తదితర వైద్యులు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

మురళీకృష్ణను సత్కరిస్తున్న భరత్‌కుమార్

మురళీకృష్ణను కలిసిన భరత్ కుమార్

ప్రజాశక్తి- అనకాపల్లి

వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు గంగుపాం నాగేశ్వరరావుతో కలిసి శనివారం నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. భరత్ కుమార్‌కు మురళీకృష్ణ దంపతులు వారిని సాదరంగా ఆహ్వానించి, హారతి ఇచ్చి సాలువాతో సత్కరించారు. అనంతరం మలసాల భరత్ మురళీకృష్ణ దంపతులను దుస్సాలు, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ అనకాపల్లిలో వైస్సార్సీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. దీనికి కొణతాల మురళీకృష్ణ స్పందిస్తూ అందరం కలిసి సమిష్టిగా వైఎస్.జగన్, గుడివాడ అమర్నాథ్ నాయకత్వంలో మలసాల భరత్ కుమార్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొణతాల రాంకీ, ఆడారి చక్రవర్తి, కొణతాల శ్యాం కుమార్, కొణతాల కృష్ణంరాజు, పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు ముకుంద వాసు, పెంటకోట శాంతి సన్యాసినాయుడు, కోరిబిల్లి ప్రసాద్, ఏపూరి వాసు, మద్దాల మహేశ్వరరావు, పిల్లా సత్యనారాయణ, గండేపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-కశింకోట

వైసిపి ప్రభుత్వ హయాంలోనే సంక్షేమ ఫలాలు ప్రజలు చేరుతున్నారని వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని తేగాడ, పేరంటాలపాలెం, జోగారావుపేట సచివాలయాలను శనివారం ఆయన సందర్శించారు. సందర్భంగా ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే తిరిగి వైసిపి గెలవాలన్నారు. ఈ సందర్భంగా త్యాగాడలో వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగ లక్ష్మి గున్నయ్య నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, సర్పంచులు నీటిపల్లి ఈశ్వరమ్మ, కొన నాయుడు, కరణం శ్యామ్‌సన్, నీటిపల్లి దివాకర్, నీటిపల్లి లక్ష్మి, జగన్ పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేస్తూ సమాజాభివృద్ధికి దోహదపడాలని జెసిఐ నేషనల్ వైస్ ప్రెసిడెంట్, ఐఐటి తిరుపతి ఇంటర్నేషనల్ ఆఫీసర్ ఎన్.బి హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక డైట్ కళాశాలలో శనివారం వైబ్రంట్ డైట్ పేరుతో కళాశాల 18వ వార్షికోత్సవ వేడుకలు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హర్షవర్ధన్ రెడ్డి ముందుగా రత్నాకర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచించి నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ విద్య అంటేనే ఆవిష్కరణలు, అపార విద్యా అవకాశాలకు అడ్డా అని, దీనికి నిలువెత్తు నిదర్శనం డైట్ కళాశాల అని కితాబునిచ్చారు. విద్యార్థులు మంచి విజన్ ఏర్పరచుకొని నవ సమాజంలో మంచి ఇంజనీర్లుగా ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. నిరంతరం అధ్యయనం చేస్తూ ఉంటేనే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలుగుతారని చెప్పారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ యువతకు ఏది అసాధ్యం కాదన్నారు. అనంతరం ఎంవిఎస్ సాహితీ చాగంటి ఆలపించిన గేయాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. క్యాంపస్ సెలెక్షన్స్ లో ఉద్యోగాలు సాధించిన, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల వారి తల్లి దండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, డీన్స్ డాక్టర్ పార్వతి, కృష్ణనాగ్, కే.ఎస్ ఈశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి శంఖారావాన్ని జయప్రదం చేయండి

ఆ పార్టీ నేతలు బుద్ధ, బత్తుల

ప్రజాశక్తి-అనకాపల్లి, బుచ్చయ్యపేట

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన శంఖారావాన్ని జయప్రదం చేయాలని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు పేర్కొన్నారు. శనివారం అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో నాగజగదీశ్వరరావు, బుచ్చయ్యపేటలో బత్తుల తాతయ్యబాబు విలేకర్ల సమావేశాల్లో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్ రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రానున్న 40-50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నారా లోకేష్ పర్యటించనున్నారని, ఒక్కరోజులో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. శంఖారావం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా నోట్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలు నేరుగా నారా లోకేష్‌తో తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంటుంద వెల్లడించారు.

విస్తృతంగా జనుము పంట సాగు

తక్కువ పెట్టుబడితో ఆదాయం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాల్లో జనుము పంట ముమ్మరంగా సాగు అవుతుంది. ఖరీఫ్ సాగు వరి పంట కోతలు కోసిన వెంటనే రైతులు జనము వేశారు. వడ్డాది, మంగలాపురం, బంగారుమెట్ట, చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, బుచ్చయ్యపేట, కండిపూడి, రాజాం, తదితర గ్రామాల్లో జనుము పంట వందలాది ఎకరాల్లో సాగు అవుతుంది. ప్రస్తుతం జనుము పంట పూత దశలో వుంది. అదనపు ఆదాయంగా జనుము పంట ఉందని రైతులు తెలిపారు. ఖరీఫ్ వరి కోతలు అయిన వెంటనే రైతులు పొలాల్లో జనము విత్తనాలు చల్లుతారు. మరో 20 రోజుల్లో జనముపంటను కోస్తారు. కోసిన వెంటనే ఎండబెట్టి గింజలను తీస్తారు. కిలో 60 రూపాయలు వరకు ధర పలుకుతుంది. తక్కువ ఖర్చుతో అదనపు ఆదాయం ఉంది. తక్కువ పెట్టుబడితో ఆదాయం వచ్చే ఈ పంటను ఈ ఏడాది రైతులు అధికంగా సాగు చేస్తున్నారు.

ఏపుగా పెరిగిన జనుము పంట

రైవాడ నీరు రైతులుకా? అదానీకా?

-ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రి బూడి తేల్చాలి
-సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న డిమాండ్

ప్రజాశక్తి- దేవరాపల్లి

దేవరాపల్లి సమీపంలోని పెదకోట, రేగులపాలెం వద్ద అదాని హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇకపై రైవాడ రిజర్వాయర్ నీరు) రైతులుకా! అదానీకా! అనేది రాష్ట్ర ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు తేల్చి చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదాని పేరు ముందు పెట్టకుండా ఎన్ఆర్ఈడిసిఎపి (న్యూ రేనేబుల్ ఎనర్జ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఎపి లిమిటెడ్) పేరుతో దేవరాపల్లి, వేపాడ మండలాల సరిహద్దుల్లో పెదకోట, రేగుల పాలెం వద్ద 1000 మెగావాట్ల పంప్ (లిఫ్ట్) స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు, అల్లూరి జిల్లాలోని రైవాడ రిజర్వాయర్‌కు నీళ్ళు వచ్చే గెడ్డపై మరో 1500 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మాణానికి అదాని 2022లో విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామిక సమ్మిట్‌లో ఎపి ప్రభుత్వంతో ఎంఒయు కుదుర్చుకున్నారని తెలిపారు. సముద్రంలో వృథాగా కలిసిపోయే నీటితోనే ఈ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తామని, ఎవరికీ ఇబ్బంది కలిగించబోమని గిరిజనులను, రైతులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కాని ఈ ప్రాజెక్టులు పూర్తయితే రైతులకు ఒక్క చుక్క నీరు కూడా వెళ్లకుండా సైక్లింగ్ చేస్తూనే ఉంటారని, రైవాడ ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లనుందని పేర్కొన్నారు. ఇప్పటికే రైవాడ రిజర్వాయర్ ఉద్దేశానికి తూట్లు పొడుస్తూ విశాఖ తాగునీరు పేరు చెప్పి రైతులకు పూర్తిస్థాయిలో నీరు ఇవ్వడం లేదని, ఈ నీటి కోసం రైతులు చేసిన ఉద్యమాన్ని అడ్డం పెట్టుకొని కొంత మంది అధికారం పొందారు తప్పా రైతులకు నీరు రాలేదని తెలిపారు. ఇప్పుడు అదాని పంపు స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టులు ప్రారంభమైతే దేవరాపల్లి, అల్లూరి, విజయనగరం జిల్లాలోని ప్రాంతాలు సర్వనాశనమౌవుతాయని, రైవాడ, తాడిపూడి రిజర్వాయర్లకు ఒక్క చుక్క కూడా నీరు రాదని పేర్కొన్నారు. అందుకే సిపిఎం, గిరిజన సంఘం అండతో స్థానిక గిరిజనులు అదాని ప్రాజెక్టు పనులు అడ్డుకుంటున్నారని తెలిపారు. దీనిపై అధికార పార్టీ నాయకులు నోరు విప్పకపోవడం, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తన సొంత మండలానికి జరుగుతున్న నష్టంపై కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా దీనిపై బూడి స్పందించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సంఘం నాయకులు సూరిబాబు

విఓఎలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

విఓఎలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని విఓఎల సంఘం జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు డిమాండ్ చేశారు శనివారం దేవరాపల్లి సిఐటియు కార్యాలయంలో జి.రాము అధ్యక్షతన విఓఎలు విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సిసి పోస్టులు భర్తీ సందర్భంగా విఓఎ ప్రమోషన్లు సౌకర్యం కల్పించాలని, వివోఏలు ఏ కారణంతోనైనా చనిపోతే వారి కుటుంబానికి గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.7 లక్షలు ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2.24 కోట్లు విడుదల చేయాలని, 60 ఏళ్ల నిండిన వారికి నిలుపుదల చేసిన వేతనాలను చెల్లించాలని, గ్రామ సంఘం నుండి రూ.2000 ప్రతి వివోఏ తీసుకునేలాగా చర్యలు చేపట్టాలని కోరారు. 14 సంఘాలలోపు ఉన్నటువంటి వివోలలో పనిచేస్తున్న వివోఏలకు వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పై డిమాండ్లపై ప్రభుత్వం హామీ ఇచ్చిందని, వాటిని తక్షణమే అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి సృజన అప్పారావు, టి.అప్పారావు, లీలా, ఆర్ వెంకటి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు

ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కులను మండలంలోని బాధిత కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం అందజేశారు. మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఈర్లె మహేష్ ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. ఆ గ్రామానికి ఉపముఖ్యమంత్రి స్వయంగా వెళ్ళి మృతుడి భార్య తులసికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.3లక్షల చెక్కును అందజేశారు. అలాగే కె.సంతపాలెంకు చెందిన గవిరెడ్డి ఎర్రినాయుడు, చంద్రయ్యపేట గ్రామానికి చెందిన బోకం సురేష్‌లు గత నెలలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో మృత్యువాత పడ్డారు. వారి ఇరువురి కుటుంబాలకు డిప్యూటీ సియం ముత్యాలనాయుడు చొరవతో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున సీఎంఆర్ఎఫ్ మంజూరు కాగా, వాటి చెక్కులను వారి ఇంటికి వెళ్లి ఎర్రినాయుడు భార్య రామలక్ష్మికి, సురేష్ భార్య భారతికి అందజేశారు. వారి పిల్లలు 6వ తరగతిలోకి రాగానే వసతి గృహంలో చేర్పించి చదువుకోవడానికి సహాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అయన వెంట జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఆయన తనయుడు శ్రీకాంత్ ఉత్సవ మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని, కొణతాల లక్ష్మీనారాయణ, స్థానిక సిఐ వినోద్‌బాబును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి మెమోంటోలు అందజేశారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేగి గోపికృష్ణ, కాండ్రెగులు సతీష్, పెంటకోట రాము, వేగి రామకోటి, వేగి దొరబాబు, బొడ్డేడ బాలాజీ, వేగి వెంకటరావు, వేగి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పీలా గోవిందను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

దేవాదాయ శాఖలో ఉద్యోగోన్నతులు, బదిలీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

సుదీర్ఘకాలం అనంతరం దేవాదాయ శాఖలో ఉద్యోగోన్నతులు, బదిలీలు జరిగాయి. సహాయ కమిషనర్లకు ఉప కమిషనర్లుగానూ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లకు సహాయ కమిషనర్లుగానూ ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించి రామతీర్థాలు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బిహెచ్ఎస్ఎస్.కిషోర్ కుమార్‌కు డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఇఒగా నియమించారు. అన్నవరం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న డివిఎల్.రమేష్ బాబుకు డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించారు. అయితే విశాఖపట్నంలో ఇన్‌ఛార్జి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎన్.సుజాతకు సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగోన్నతి ఇవ్వలేదు. కోనసీమ జిల్లాలో ఎసిగా పనిచేస్తున్న కెఎన్‌డివి.ప్రసాద్‌కు డిసిగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విజయనగరంలోని మాన్సాస్ ట్రస్ట్ ఇఒగా నియమించారు. ఇక్కడ ఇఒగా పని చేస్తున్న డివివి ప్రసాద్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. సింహాచలం దేవస్థానంలో గతంలో ఎఇఒగా పనిచేసి ప్రస్తుతం అన్నవరంలో ఎఇఒగా పని చేస్తున్న వై.శ్రీనివాసరావుకు సహాయ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రామతీర్థాలు దేవస్థానం ఇఒగా నియమించారు. శ్రీకాకుళం జిల్లాలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బలివాడ ప్రసాద్ పట్నాయక్‌కు సహాయ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పించి అదే జిల్లా ఎసిగా నియమించారు. అక్కడ ఎసిగా పని చేస్తున్న హరి సూర్య ప్రకాష్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. విశాఖపట్నం ఇసుకకొండ శ్రీ సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఇఒ బి.నగేష్ బాబును సహాయ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పించి తూర్పుగోదావరి జిల్లా మావుళ్ళమ్మ వారి దేవస్థానం ఇఒగా నియమించారు. వన్ టౌన్ పెద్ద శివాలయం ఇఒ నీలిమకు ఎసిగా ఉద్యోగోన్నతి కల్పించి విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఇఒగా నియమించినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఆమె ఉద్యోగోన్నతి ఉత్తర్వులు నిలుపుదల చేశారు.

వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

యాత్ర సినిమాను తిలకించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని స్థానిక ఎస్‌టిబిఎల్ సినిమా హాల్లో శుక్రవారం సాయంత్రం పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ యాత్ర సినిమాను తిలకించారు. ఈ సందర్భంగా వైసిపీ నేతలు, అభిమానులు సినిమా హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన వైయస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. అనంతరం వైసిపి నేతలు అభిమానులు కార్యకర్తలతో యాత్ర సినిమాను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్ర సినిమాలో జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా ఎదుర్కొన్న సంఘటనలు బాగా చిత్రీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైసిపి నేతలు బోకం రామునాయుడు, కోటాన రాము, పాలిసెట్టి సురేష్, టి శేఖర్, గొర్లి నూకరాజు, బలిరెడ్డి కనకరాజు, ఎర్రం శెట్టి రాము, పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణం సుంకరమెట్ట వద్ద ఉన్న శ్రీసత్యనారాయణ స్వామి, శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈనెల 16న మాఘమాసం రథసప్తమి సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ చైర్మన్ కె ఎం నాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, రాష్ట్ర వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎక్కువ మంది దర్శనం చేసుకున్న వీలుగా క్యూలైన్లు, ఆలయం చెట్టు తుప్పలు తొలగిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు విద్యాసాగర్ శర్మ, ధర్మకర్తలు నేతల చంద్రకళ, పెంటకోట అప్పలనాయుడు, తగరంపూడి నర్సింగరావు, మారిశెట్టి శ్రీనివాసరావు, తాడి నాగలక్ష్మి కోటేశ్వరరావు , విజ్జపుముకుంద, ఎం విద్యాసాగర్, శంకర్రావు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లును పరిశీలిస్తున్న కెఎం.నాయుడు తదితరులు

అక్రమార్కులను జైల్లో పెట్టడం ఖాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

రానున్న ఎన్నికల్లో జనసేన తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని, వైసిపి అక్రమార్కులను జైల్లో పెట్టడం ఖాయమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. స్థానిక బైపాస్ రోడ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రానికి ఒక పరిశ్రమను తెలైన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, వైసిపి ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను మూత వేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ, అనకాపల్లి బెల్లం మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విద్య వైద్యం ఉచితంగా ఇస్తామన్నారు. నియోజకవర్గంలో 500 మంది చొప్పున వ్యాపారవేత్తలను పది లక్షల రూపాయలు చొప్పున అందించి తద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామన్నారు. లా అండ్ ఆర్డర్ కఠినంగా అమలు చేసి భూ కబ్జాలకు పాల్పడిన వారిపై కేసులు పెట్టి జైల్లో పెడతామన్నారు. సొంత ప్రభుత్వ కార్యాలయ భవనాలను నిర్మిస్తామని, వైసీపీ కంటే మెరుగైన సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ఐదు సీట్లు వస్తే గొప్ప అన్నారు. కుల మతాలకు అతీతంగా టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొలిశెట్టి సత్య, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు సతీష్ ,వంశీకృష్ణ యాదవ్, భాస్కర్ రావు పాల్గొన్నారు.

కొండకర్ల ఆవలో విహరించిన నాగబాబు

అచ్యుతాపురం : సినీ నటుడు, జనసేన నాయకుడు కొణిదల నాగబాబు శనివారం కొండకర్ల ఆవ నీటిలో ఫైబర్ బోట్‌పై విహరించారు. ఆ అందాలను, పక్షుల కిలకిల రాగాలను ఆయన తిలకించారు. ప్రకృతి సిద్ధంగా ఆవ అందాలు చాలా చూడముచ్చటగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆవలో పర్యటించడం మన:శాంతిని ఇస్తుందన్నారు. అతనితోపాటు జనసేన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ సుందరపు వెంకట సతీష్ కుమార్, ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ సుందరపు విజయకుమార్, కార్యకర్తలు ఉన్నారు.

కొండకర్ల ఆవలో విహరిస్తున్న నాగబాబు తదితరులు

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

-ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ- రూ. 19.16కోట్ల ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -కొత్తకోట:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్న సంకల్పంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. వైయస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం రావికమతం, రోలుగుంట మండలాలకు సంబంధించి కొత్తకోట హైస్కూల్లో శనివారం ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, ఆసరా నాలుగు విడతల్లో నియోజక వర్గానికి రూ.168 కోట్లు రాగా రావికమతం మండలానికి 1526 గ్రూపులకు రూ.11కోట్ల 89లక్షలు, రోలుగుంట మండలానికి 1005 గ్రూపులకు రూ.7 కోట్ల 27 లక్షలు డ్వాక్రా మహిళల ఖాతాలలో జమయ్యాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు దశల వారీగా రుణ మాఫీ చేసిందన్నారు. సున్నా వడ్డీతో పాటు ఆసరా పథకంలో మంజూరైన నగదు నేరుగా డ్వాక్రా సంఘాల ఖాతాలలో జమ చేసి మహిళలకు సిఎం అండగా నిలిచారన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు రుణమాఫీ చేస్తానని, బ్యాంకులలో తాకట్టు పెట్టిన బంగారం విడిపిస్తానని చెప్పి మహిళలను మోసం చేసారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మరలా సీఎం జగన్ మోహన్ రెడ్డి ని గెలిపించాలని ధర్మశ్రీ కోరారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో రావికమతం, రోలుగుంట ఎంపీపీలు పైల రాజు, వై.శ్రీనివాసరావు, జడ్పీటీసీ తలారి రమణమ్మఆదిమూర్తి, డీసీఎంస్ డైరెక్టర్ సత్యదేవ్, మండల వైసీపీ అధ్యక్షులు ముక్కా మహాలక్ష్మి నాయుడు, వైస్ ఎంపీపీలు భవాని ప్రసాద్, దంట్ల రమణ, ఎంపీడీఓ బానోజీరావు నర్సీపట్నం, చోడవరం వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ లు రత్నప్రభ, సత్యనారాయణ, రావికమతం, రోలుగుంట ఏపిఎం తిలక్, సాధన, ఎంపీటీసీ పూడి దేవా, కుంచా లక్ష్మి శంకరరావు, కొత్తకోట సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, మండల వైసీపీ యువజన అధ్యక్షులు శిలం కళ్యాణ్ వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధర్మశ్రీ

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇవిఎంలపై ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి-కొత్తకోట:వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇవిఎంలపై కొత్తకోట హైస్కూల్ లో ఓటర్లకు శనివారం అధికారులు అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈవీఎం, వివి ప్యాట్లు పరికరాలు ప్రదర్శించారు. ఓటు వేయడంలో లేవనెత్తిన అనుమానాలను ఎమ్మార్వో సతీష్ నివృత్తి చేశారు. ఈవీఎంలో అభ్యర్థికి వేసిన ఓటు సక్రమంగా ఉన్నదీ లేనిదీ వివి ప్యాట్లలో చూడవచ్చునని తెలిపారు. వీటిని కొత్తకోట సర్కిల్ సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ లక్ష్మణరావు పరిశీలించారు. ఈ కార్యక్రమం లో విఆర్వో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పందూరులో నిలిచిన తాగునీటి సరఫరా

ప్రజాశక్తి -కోటవురట్ల:పందూరు గ్రామంలో గడిచిన నాలుగు రోజులుగా తాగునీటికి స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పందూరు గ్రామంలో ఎస్సీ కాలనీ వద్ద కాంట్రాక్టర్ రాజు అనే వ్యక్తి పంచాయతీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టడమే కాకుండా పంచాయితీ తాగునీటి పైపులైను ఇంటి నిర్మాణ పిల్లర్ల లోనికి ఆక్రమించుకుంటూ కట్టడం చేపట్టడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో, నిర్మాణం చేపడుతున్న ఇంటిని పంచాయితీ కార్యదర్శి జోష్ణ పరిశీలించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేపట్టాలని తెలిపారు. దీనికి నిర్మాణదారుడు నిరాకరించడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గడిచిన నాలుగు రోజులుగా తాగునీటికై గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

పరిశీలిస్తున్న సర్పంచ్

రూ.3 లక్షలతో ప్లాట్‌ఫారం పనులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో నీలిగుంట గ్రామ పంచాయతీలో రామాలయం వద్ద రూ.3లక్షల నిధులతో ప్లాట్ ఫామ్ నిర్మాణం చేపడుతున్నట్లు స్థానిక సర్పంచ్ వరహాలు బాబు తెలిపారు. గతంలో కోవెల ప్రాంగణం అస్తవ్యస్తం గా ఉండే దని మండల పరిషత్తు నిధులతో నిర్మాణం చేపట్టడంతో స్థాని కులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి-మాకవరపాలెం:అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి రుత్తల సత్యనారాయణ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖలకు సంబంధించి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అధికారులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు లక్ష్మీ, రాజారావు, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ సీతామహాలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి

జాతీయస్థాయి పోటీల్లో బాక్సర్లు రాణించాలి

ఆర్థిక సాయం అందజేస్తున్న నారాయణరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు బెంగుళూరులో జరిగే సౌత్ జోన్ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌కు నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన నలుగురు బాక్సర్లు పయనమయ్యారు. ఈ టోర్నమెంట్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఓపెన్ టాలెంట్ హంట్‌గా నిర్వహించి ప్రైజులు కూడా అందజేయనున్నారు. ఈ టోర్నమెంట్‌కు బొంతు మౌనిక (81 కేజీలు) బొమ్మల రాజేశ్వర(50 కేజీలు), చికిరి మణికుమార్ (75 కేజీలు), ఊలం రవికుమార్ (75కేజీలు) పాల్గొననున్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు రాణించి మెడల్ తీసుకు రావాలని అకాడమీ డైరెక్టర్లు వెలగా నారాయణరావు, బోళం శివ, అకాడమీ సీనియర్ కోచ్ యర్రా శేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు. వెలగా నారాయణరావు 2వేలను వీరికి అందించారు.

పోలీసుల అదుపులో సూర్యచంద్ర

జనసేన నేత హౌస్ అరెస్టు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్ తాండవ జలాశయ ప్రధాన గేట్ల మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం శాంతియాత నిరసన దీక్షకు జనసేన నాయకులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు జనసేన నాయకులను హౌస్ అరెస్టు చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ను ఆయన స్వగ్రామం మండలంలోని చెర్లోపాలెంలో హౌస్ అరెస్టు చేశారు.

'దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:గొలుగొండ మండలం కొంగసింగి గ్రామంలో నరేంద్రపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని బిఎస్పీ నర్సీపట్నం నియోజకవర్గ అభ్యర్థి బొట్టా నాగరాజు డిమాండ్ చేశారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరేంద్రను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, గ్రామంలోని రజక కులానికి చెందిన వేములపూడి నరేంద్రపై అదే గ్రామంలో ఓ సామాజిక వర్గానికి చెందిన నాగులాపల్లి లావరాజు ఘర్షణ పడి పంచాయతీకి పిలిచి ఉప సర్పంచ్ రమణబాబు నరేంద్రను కొట్టారన్నారు. నరేంద్ర ఇంటికి వెళ్లే క్రమంలో సుమారు 34 మంది యువకులు విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. అడ్డుగా వచ్చిన నరేంద్ర అమ్మ పెద్దమ్మను కూడా మహిళా అని చూడకుండా కొట్టారన్నారు. ఈ అవమానం తట్టుకోలేక పురుగుల మందు తాగి పోలీస్ స్టేషన్ కూడా ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు. తక్షణమే హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కె.గంగాధర పాల్గొన్నారు.

కెజె పురంలో పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలో కస్పా జగన్నాథపురం పశు వైద్యశాలలో సుమిటో ఫైనాన్స్ గ్రూప్ ఇండియా క్రెడిట్ కంపెనీ ఆర్థిక సహాయంతో ఉచిత పశు వైద్య శిబిరం, రైతు సదస్సు నిర్వహించినట్లు మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. పాడి రైతులకు పశు గ్రాస పెంపకం, కిసాన్ క్రెడిట్ కార్డుల రుణాలపై అనగాహన కల్పించారు. పశువులకు గర్భ కోశ చికిత్సలు చేశారు. నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 42 పశువులకు పేడ, రక్త పరీక్షలు నిర్వహించినట్లు చిట్టి నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణ బాబు, పాల కేంద్రం అధ్యక్షులు ఎల్లపు శ్రీను, ఉప సర్పంచ్ లు, కె.జె. పురం పశు వైద్యాధికారులు మణి లక్ష్మణ్, గణేష్ పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

85 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -కోటవురట్ల:గ్రామీణ ప్రాంతాల్లో 104 వైద్య సేవలను సద్వినియోగించుకోవాలని వైద్యులు మౌనిక సూచించారు. శనివారం పందూరు గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద వైద్య సేవలు నిర్వహించారు. సుమారు 85 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ, ప్రతి నెల గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగించుకోవాలని ప్రధానంగా బిపి, షుగర్, సహ వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారని ఆమె తెలిపారు.

జగనన్న గృహాల రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి- కోటవురట్ల: ప్రభుత్వం జగనన్న గృహ లబ్దిదారులకు శాశ్వత హక్కు కల్పిస్తూ ప్రభుత్వం చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం కొనసాగించారు. ఈ మేరకు పందూరు సచివాలయంలో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియను ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 802 మంది లబ్దిదారులకు హక్కు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇంతవరకు 522 రిజిస్ట్రేషన్లు పూర్తయినట్లు తెలిపారు.గతంలో నిర్మాణాలు చేపట్టుకుని ఓటిఎస్ నిమిత్తం డబ్బులు చెల్లించిన వారికి శాశ్వత హక్కు కల్పిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేపడుతున్న సిబ్బంది

పడవలను పరిశీలిస్తున్న ఫిషరీష్ అధికారులు

అలల తాకిడికి దెబ్బతిన్న పడవలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని డిఎల్ పురం సముద్ర తీరంలో శనివారం అలలు తాకిడికి స్వల్పంగా పడవలు వలలు దెబ్బతిన్నాయని మత్స్యకారులు తెలిపారు. ఒక్కసారిగా అలలు ఉధృతంగా రావడంతో 8 పడవలు, 8 వలలు దెబ్బతిన్నాయని, సుమారుగా 2 లక్షల 50 వేలు నష్టం వాటిల్లిందన్నారు. ఈ మేరకు గ్రామ ఫిషరీస్ అధికారులు దెబ్బతిన్న పడవలు వలలను పరిశీలించారు.

స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజలపై భారీగా పన్నుల భారం :టిడిపి

ప్రజాశక్తి - చీడికాడ:వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రజలపై పన్నులు భారీగా వేశారని టిడిపి నేతలు విమర్శించారు. మండల అప్పలరాజు పురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, ఇన్చార్జి పీవీజీ కుమార్ లు కలిసి శనివారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా పాదయాత్ర ప్రారంభించారు. అప్పలరాజుపురం సింగవరం, ఎల్బీ పట్నం, ఖండివరం, వీరభద్ర పేట కోనాం మంచాల గ్రామాలలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాబు ఆంధ్ర రాష్ట్రానికి భవిష్యత్తులో చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు లేక ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పి.చిన్నంనాయుడు, మాజీ జెడ్పిటిసి రమణమ్మ, సర్పంచులు కొల్లి సూరి నాయుడు, కసిరెడ్డి శ్రీరామ్ మూర్తి, జలాశయం చైర్మన్ ముసలి నాయుడు, ఎంపీటీసీలు దారపు పెద్దనాయుడు, పైల ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిబాబు

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

- జెడ్‌పిటిసి గిరిబాబు

ప్రజాశక్తి-గొలుగొండ:విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అన్నారు. మండలంలోని చీడిగుమ్మల హైస్కూల్లో శనివారం పేరెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ, ప్రతీ విద్యార్థికి పది పరీక్షలు ఎంతో కీలకమన్నారు. సమయం తక్కువగా ఉందని, అందరూ శ్రద్ధగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదానికి విస్తృత సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 16న జరుగనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలు ఎంతో ఐక్యమత్యంతో 42 రోజులుపాటు ప్రభుత్వంతో పోరాడి డిమాండ్లను నెరవేర్చుకున్నారన్నారు. ఈ పోరాటం చిరస్థాయిగా మిగులుతుందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, గౌరవ సలహాదారులు బృందావతి, అధ్యక్షులు వై.తులసి, ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి. కోశాధికారి పద్మ, నాయకులు శోభారాణి, వెంకటలక్ష్మి, శ్రీదేవి, నూకరత్నం, చిన్నమ్ములు, లక్ష్మి, సాయి, సరస్వతి పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు

ఆటో రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యాన..

ఈ నెల 16న జరగనున్న దేశవ్యాపిత ఆటో బంద్‌ను జయప్రదం చేయాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ పిలుపునిచ్చారు. బంద్ జయప్రదాన్ని కోరుతూ రైల్వే స్టేషన్ వద్ద సంఘం ఆధ్వర్యాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ఆటో, మోటార్ రంగాన్ని నాశనం చేయాలని చూస్తున్నాయని తెలిపారు.

మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు తులసి

ములగాడ : దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదంచేయాలని కోరుతూ పశ్చిమ నియోజకవర్గంలోని కాకర్ల గ్రామం భగత్ సింగ్ జంక్షన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుడాల రాంబాబు, ఎఐటియుసి నాయకులు కాంగ్రెస్‌ల సత్యాంజనేయ, నాయకులు వై.కనకరాజు, ఇ.కామేశ్వరరావు, శ్రీరామ్మూర్తి, యల్లాజీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఘనంగా బాలోత్సవం

-ఉత్సాహంగా పలు రకాల పోటీలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం పరిసర ప్రాంతాలలో బాల బాలికలలో ఉన్న సృజనాత్మకతను, కళ నైపుణ్యాన్ని వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఘనంగా బాలోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో బాల బాలికల్లో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్ లు అని మూడు విభాగాల వారీగా వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు అకడమిక్ ఈవెంట్స్, కల్చరల్ ఈవెంట్స్ అనే రెండు విభాగాలుగా చేపట్టారు. అకడమిక్ ఈవెంట్స్‌లో చిత్రలేఖనం, వ్యాసరచన, కథారచన, స్పెల్ బీ, క్విజ్, మట్టితో బొమ్మలు, పద్యం భావం, తెలుగులో మాట్లాడడం, సైన్స్ ఎగ్జిబిషన్ తదితరవి ఉన్నాయి.కల్చరల్ ఈవెంట్స్ లో విచిత్ర వేషధారణ, శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలు, ఏకపాత్రాభినయం కోలాటం, ఫ్యాన్సీ డ్రెస్ తదితరవి నిర్వహించారు. ఈ పోటీలలో నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో గల వివిధ స్కూలుల నుండి సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలోత్సవం గౌరవ అధ్యక్షులు దస్త్రాల రాఘవేంద్రరావు, అధ్యక్షులు డాక్టర్ అధికారి గోపాలరావు, కన్వీనర్ కె.త్రిమూర్తులు రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు, స్థానిక ప్రధానోపాధ్యాయిని మాధవి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

బహుమతులు అందజేస్తున్న గోపాలరావు, త్రిమూర్తులురెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాసితులు, నాయకులు

కారిడార్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, నిర్వాసితులు, నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని రాజయ్యపేట పంచాయతీ శివారు బోయపాడులో శనివారం నిర్వాసితులు, నాయకులు సమావేశం నిర్వహించారు. 2013 భూసేకరణ చట్టప్రకారం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రతీ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. ప్రతీ సెంటు భూమికి పరిహారం, ప్రతీ నిర్వాశితుడికి రూ. 15 లక్షల ప్యాకేజీ, ఇల్లు కోల్పోయిన వారికి 25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోతున్నవారికి అనువైన ప్రదేశంలో ఇల్లు స్థలాలు ఇవ్వాలని తెలిపారు. మత్స్యకారుల ఉపాధికి ఫిషింగ్ జెట్టి నిర్మించాలని, సాగు భూములకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు.ప్రజలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ యూనిట్‌లను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేసిన తర్వాత మాత్రమే పనులు చేపట్టాలని, అప్పటివరకు నిలుపుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బుచ్చిరాజుపేట, అమలాపురం గ్రామ సర్పంచ్‌లు కాళ్ళ శ్రీనివాసరావు, పెదపూడి శంకర్రావు, రాజయ్యపేట ఉప సర్పంచ్ కొండలరావు, నాయకులు ఎం.రాజేష్, వి.శివ, బి.గోవిందరావు, ఎస్.అప్పలరాజు, పి.గంగరాజు, పి.సత్తియ్య, వి.రాజు, పి.అప్పలరాజు, పి.కోదండరావు, వి.బుజ్జి, ఎం.రాంబాబు, ఆర్.గోవిందరావు, ఎ.తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం దత్తత స్వీకరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ నిబంధనలను అనుసరించి స్వీకరించే దత్తతలే ఉత్తమమైనవని కేంద్ర ప్రభుత్వ దత్తత వనరుల సంస్థ (కారా) న్యూఢిల్లీ ప్రోగ్రాం డైరెక్టర్ జగన్నాథ పతి అన్నారు. శనివారం హోటల్ రాయల్ ఫోర్ట్‌లో కారా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల దత్తత వనరుల సంస్థ (సారా), ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగాలు సంయుక్తంగా చట్ట బద్ధ దత్తతలపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించాయి. పలు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో చేరిన మల్లు దొర మనవడు

ప్రజాశక్తి-కలెక్టరేట్:స్వాతంత్ర్య సమర యోధుడు గాం మల్లుదొర మనవడు గాం బోడిదొర ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురవ్వగా ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశాల మేరకు మెరుగైన చికిత్స అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు చికిత్స నిమిత్తం శనివారం కెజిహెచ్‌లో ఆయనను చేర్పించారు. ఆయన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందివ్వాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శంకరరావును ఆదేశించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరుల అనువు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 7న ప్రారంభించి నాల్గోవ రోజు శనివారం అనువు మహోత్సవంను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అనంతరం కోనేరులో విగ్రహాన్ని ఘనంగా నిమజ్జనం చేశారు.